క్లుప్తంగా

రైతు వేదికలో 'వ్యవసాయ కార్యాలయం'

ధారూరు: మండల పరిషత్ సముదాయంలో ఉన్న వ్యవసాయ కార్యాలయాన్ని గురువారం అక్కడి నుంచి రైతు వేదికలోకి మార్చారు. ఇక నుంచి రైతులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు రైతు వేదిక వద్దకు రావాల్సి ఉంటుందని ఏఓ జ్యోతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా వ్యవసాయ కార్యాలయంలో అటెండర్ లేకపోవడం, రైతు వేదికల్లో తాత్కాలిక అటెండర్‌ను నియమించుకోవడానికి నిధులు సమకూరడంతో ఏఓ ఈ నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయ కార్యాలయంలో పనిచేసిన తాత్కాలిక అటెండర్ ఇటీవల మృతి చెందడం, 'పేరుకే వ్యవసాయ కార్యాలయం' అనే శీర్షికతో ఇటీవల 'సాక్షి'లో వార్త కథనం ప్రచురించడంతో ఏఓ స్పందించి, మండల వ్యవసాయ కార్యాలయాన్ని రైతు వేదికలోకి మార్పించారు.

దైవభక్తి అలవర్చుకోండి



యజ్ఞంలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

పూడూరు: ప్రతి ఒక్కరు దైవభక్తితో పాటు ఆధ్యాత్మికతను అలవర్చుకుని మానసికంగా, ఆర్థికంగా ఎదగాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే పాల్గొని, యజ్ఞం, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, సర్పంచ్ నవ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్, భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఆశ'ల సమస్యలు పరిష్కరించాలి



వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

పరిగి: తమ సమస్యలు పరిష్కరించాలంటూ గురువారం ఆశ వర్కర్లు ఆరోగ్య కేంద్రాల్లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకన్నా ఎక్కువగా పనిచేస్తున్న తమకు గుర్తింపు లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తంచేశారు. చాలీచాలని జీతాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని, కనీస వేతనం రూ.26వేలు అందించి పీఎఫ్, ఈఎస్ఐతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే సౌకర్యాలు కల్పించాలని ఆశలు కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆటస్థలం కేటాయింపు

పరిగి: సయ్యాద్ మల్కాపూర్ గ్రామంలోని బాపుజ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆటస్థలం లేకపోవడంతో గ్రామానికి చెందిన రమేష్ తన పొలాన్ని కేటాయించారు. బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా విద్యార్థులకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేసి, క్రీడాస్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పడంతో పక్కనే ఉన్న తన పొలంలో క్రీడాస్థలం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అందుకు గాను ఎలాంటి డబ్బులు చెల్లించనవసరం లేదని, విద్యార్థులు ఆటస్థలంగా ఉపయోగించుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. ఆటస్థలం కోసం భూమిని కేటాయించడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రష్మిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

యాలాల: దళిత యువకుడు నరేష్‌పై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కేఎన్‌పీఎస్ రాష్ట్ర ప్రతినిధి బృందం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం దేవనూరులో వారు మాట్లాడారు. ఏర్పాటు చేయబోయే అంబేడ్కర్ విగ్రహం విషయంలో కొందరూ ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు ఈ ఘటనకు ముఖ్య కారకులని ఆరోపించారు. శివ భక్తుల ముసుగులో మత విద్వేషాలు రెచ్చగొట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్, పూలే, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాల ఏర్పాటును హిందువాహిని, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరం అభినవ్, ఉపాధ్యక్షుడు ఏర్పుల చంద్రప్ప, అంబేడ్కర్ ప్రజాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం, బలరాం, అంజి, కృష్ణ ఉన్నారు.

బస్టాండ్ ఆవరణలో అన్నదానం

కొడంగల్: బస్టాండ్ ఆవరణలో గురువారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తాండూరు డిపో మేనేజర్ సమత కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. శ్రీసత్యసాయి సేవా సమితి భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో ప్రతి గురువారం అన్నదానం చేస్తామని చెప్పారు. శ్రీనివాస్‌యాదవ్, దశరథ, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

'కంటివెలుగు'కు కాసుల్లేవ్!

రెండో విడత 'కంటివెలుగు'కు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం కొరవడింది. అంధత్వ నివారణకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమానికి నిధుల కొరత కారణంగా.. కొందరు దూరంగా ఉండగా.. మరికొందరు అప్పులు చేసి శిబిరాన్ని నిర్వహిస్తూ.. మమ అనిపిస్తున్నారు.!

- అప్పులతోనే నేత్ర శిబిరాలు
- ఆసక్తి చూపని ప్రజాప్రతినిధులు!
- జీపీల్లో జమకాని వైద్యశాఖ నిధులు



కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నేతలు (ఫైల్)

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతగా 'కంటివెలుగు'ను ప్రారంభించింది. ప్రతి జీపీలో శిబిరాన్ని ఏర్పాటు చేసి, ప్రజల కంటి చూపు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్న సంకల్పంతో పథకాన్ని షురూ చేసినా.. ముందస్తుగా నిధులు మంజూరు కాకపోవడంతో ప్రభుత్వం ఆశించిన ఫలితాలు రావడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే వివిధ కార్యక్రమాలకు డబ్బులు ఖర్చు చేసి అప్పుల్లో ఉన్న స్థానిక ప్రజాప్రతినిధులు.. కంటివెలుగు కార్యక్రమానికి నిధులు పెట్టేందుకు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

జమకాని నిధులు

కుల్కచర్ల మండల పరిషత్‌లో 44 గ్రామపంచాయతీలు ఉండగా.. ప్రతి గ్రామంలో గ్రామ జనాభాను అనుసరించి ఒక్కో గ్రామంలో వారం రోజుల నుంచి 21రోజుల పాటుగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. కంటివెలుగు కొనసాగింపునకు రోజుకు రూ.వెయ్యి చొప్పున నిధులు కేటాయించారు. కానీ.. శిబిరం నిర్వహణకై వైద్యశాఖ నుంచి జీపీలకు రావాల్సిన నిధులు నేటికీ రాకపోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు 'కంటివెలుగు' విజయవంతానికి ఆసక్తి చూపని పరిస్థితులు నెలకొన్నాయి. వైద్య సిబ్బందికి తగిన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు కొంత ఇబ్బందికి గురౌతున్నట్లు తెలుస్తోంది.

అప్పులతోనే కంటివెలుగు

కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం ఎటువంటి నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రజాప్రతినిధులు మరోమారు అప్పులు చేసి పథకాలను కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం కార్యక్రమ నిర్వహణకు రూ.వెయ్యి కేటాయించినా.. అది మంజూరు కాలేదని, మంజూరైనా అవి ఎందుకూ సరిపోవని స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పడం గమనార్హం. కంటివెలుగు సిబ్బంది ఒక గ్రామపంచాయతీలో సుమారు 15మంది విధులు నిర్వహిస్తున్నారు. వారికి అన్ని విధాల సౌకర్యాలు కల్పించేందుకే అధిక వ్యయం అవుతోందని, ఉదయం టీ, బిస్కెట్, టిఫిన్స్, మధ్యాహ్న భోజనం, స్నాక్స్ వంటి ఆహార సౌకర్యాలతో పాటు టెంటు, తాగునీటి సౌకర్యం తదితర అవసరాలకు వైద్యశాఖ నుంచి అందే నిధులు ఎందుకూ సరిపోవంటున్నారు.

"అప్పులు చేసి నిర్వహిస్తున్నాం..



కంటివెలుగు కార్యక్రమానికి నిధులు మంజూరు చేయకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామపంచాయతీ నుంచి తీసుకోవడానికి అవకాశం ఇవ్వలేదు. మధ్యాహ్న భోజనం, టిఫిన్స్ మానవతాదృక్పదంతో వైద్య సిబ్బందికి అందజేస్తున్నాం.

– సౌమ్యారెడ్డి, సర్పంచ్, కుల్కచర్ల

నిధులు రావాల్సి ఉంది



'కంటివెలుగు' కార్యక్రమ నిర్వహణకు రోజుకు వెయ్యి చొప్పున నిధులు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. హెల్త్ డిపార్ట్‌మెంట్ నుంచి గ్రామపంచాయతీలకు నిధులు రావాల్సి ఉంది. త్వరలోనే ఆ నిధులు జమయ్యే అవకాశం ఉంది.

– కరీం, ఎంపీఓ, కుల్కచర్ల

ప్రైవేట్‌కు దీటుగా సర్కార్ బడులు

- ఎమ్మెల్యే కాలె యాదయ్య



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవాబుపేట: ప్రైవేటు, కార్పొరేటుకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా గురువారం మాదారంలో రూ.9.3 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మనఊరు–మనబడితో ప్రభుత్వ బడుల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని, విద్యాలయాలను బలోపేతం చేసి పేదలకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. మాదారం ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.9 లక్షలతో అన్ని రకాల పనులను అభివృద్ధి చేశారని, త్వరలోనే అన్ని పాఠశాలలకు నిధులు వస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ జయమ్మ, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ అజయ్‌కుమార్, ఎంఈఓ గోపాల్, హెచ్‌ఎం ప్రమీల, సర్పంచులు అంజయ్య, రత్నం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు ప్రకాశం, రాజశేఖర్‌రెడ్డి, ప్రసాద్, సిద్దారెడ్డి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పేదలకు వరం

- లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కొప్పుల

పూడూరు: ప్రభుత్వం నిరుపేద ఆడబిడ్డలకు ఇస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వరం లాంటిదని, ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం పూడూరులో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అవినీతి అక్రమాలకు తావు లేకుండా ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ సభ్యురాలు మేఘమాల, సర్పంచ్‌లు నవ్య, వినోద్‌గౌడ్, శ్రీధర్ గుప్తా, డీటీ మోహన్, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజేందర్, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని నీరుగారుస్తున్న కేంద్రం



బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

పరిగి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేకంగా ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. బుధవారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా గురువారం బస్టాండ్ ఎదుట బడ్జెట్ పత్రాలను దహనం చేసి మాట్లాడారు. కేంద్రం రూ.45లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన పద్దులో గ్రామీణ ఉపాధిహామీ, ఆహార సబ్సిడీ, రైతులకు అందించే రాయితీపై భారీగా కోత విధించడం ఏంటని ప్రశ్నించారు. గత బడ్జెట్‌లో రూ.89వేల కోట్లు కేటాయించిన కేంద్రం.. ఈ బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. ఉపాధిహామీ పథకాన్ని నీరుగార్చే విధంగా బీజేపీ ప్రభుత్వం చేస్తుందని, బడాబాబుల కోసం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని ఆరోపించారు. నిరుపేదలకు ఎలాంటి ఉపయోగం లేకుండా బడ్జెట్‌ను రూపొందించడం ఎంతవరకు సమంజసనీయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, యాదగిరి, సత్తయ్య, రాఘురాం, శేఖర్ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

- వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- కార్యకర్తలకు మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ భరోసా



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

బంట్వారం: అధైర్యపడొద్దు, ఎల్లవేళలా అండగా ఉంటానంటూ మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ కాంగ్రెస్ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. రెండు రోజుల క్రితం తొర్మామిడిలో ఎమ్మెల్యే ఆనంద్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకునేందుకు యత్నించగా పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మాజీ మంత్రి గురువారం కార్యకర్తలను పరామర్శించి మాట్లాడారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమనే విషయాన్ని పోలీసులు గుర్తుంచుకోవాలన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కాలనే చూస్తే తిరుగుబాటు తప్పదని, కార్యకర్తల జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ ఆయన బీఆర్ఎస్ శ్రేణులను హెచ్చరించారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు కార్యకర్తలు భయపడరని, పోలీసు బలగాల మధ్య ఎమ్మెల్యే మీటింగ్ జరపడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. దమ్ముంటే నిధులు తెచ్చి అభివృద్ధి చేసి చూపించాలన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని కార్యకర్తలను భయపెట్టాలని చూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి, బ్లాక్–1 కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, జెడ్పీటీసీ సంతోష, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు రాజు, కోఆప్షన్ సభ్యుడు తౌఫిక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, సోషల్ మీడియా ఇన్‌చార్జిలు గౌస్, అజీమ్, నాయకులు వీరేశం, సంగమేశ్వర్, వెంకటేశం, సలీం, నరేష్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప



బోరు వేయిస్తున్న వైస్ చైర్‌పర్సన్ దీప తదితరులు

తాండూరు టౌన్: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప అన్నారు. గురువారం పట్టణంలోని 12, 20వ వార్డుల్లో ఎమ్మెల్యే ప్రత్యేక నిధులతో రెండు తాగునీటి బోర్లు వేయించారు. ఈ సందర్భంగా దీప మాట్లాడుతూ ఇప్పటికే మిషన్ భగీరథ పథకం ద్వారా పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుందని, వేసవిలో ఏర్పడే నీటి ఎద్దడి నివారణకు గాను ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. ఎమ్మెల్యే నిధులతో ఇప్పటికే 1,4,5,13,23 వార్డుల్లో బోర్లు వేయించారని చెప్పారు. అలాగే సీసీరోడ్లు, డ్రైనేజీలతో పాటు పలు అభివృద్ధి పనులకు గాను ఒక్కో వార్డుకు రూ.కోటి ఎమ్మెల్యే మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, పూజ, ఆసిఫ్, సంగీత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నయీమ్, పార్టీ నాయకులు పట్లోళ్ల నర్సింహులు, హరిహరగౌడ్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

కుల్కచర్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సద్గురు మాత సుదీక్ష అన్నారు. గురువారం చౌడాపూర్ మండల పరిధిలోని కొత్తపల్లి తండా వద్ద నిరంకారి సత్సంగ్ భవన ప్రారంభోత్సవంలో ఢిల్లీకి చెందిన సద్గురుమాత సుదీక్ష, సవిందర్ దేవ్ సింగ్ మహరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దైవచింతనతోనే భగవంతుని సాక్షాత్కారం లభిస్తుందని చెప్పారు. భక్తులు మానవతా విలువలను పెంపొందించుకోవాలని, ఎదుటివ్యక్తులకు సహాయం చేయాలన్న సంకల్పంతో ప్రతి ఒక్కరు ముందుకుసాగాలని సూచించారు.

ఘనంగా మహాపడి పూజ



పడిపూజ మహోత్సవంలో పాల్గొన్న శివ భక్తులు

పరిగి: రాపోల్ గ్రామంలో గురువారం ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. చాకలి జంగయ్యస్వామి ఆధ్వర్యంలో మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో శివ భక్తులు అధికసంఖ్యలో పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు నాయకులు సూచించారు. ప్రతి ఒక్కరు భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని, భక్తి మార్గంతోనే ముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో శివ భక్తులు, నాయకులు యాదవరెడ్డి, రామకృష్ణ, యాదయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి రూ.3.7 కోట్లు

బంట్వారం: సీసీరోడ్ల నిర్మాణానికి కోట్‌పల్లి మండలానికి సంబంధించి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.3.7 కోట్లు మంజూరయ్యాయని బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హరిత'హననం'

ప్రభుత్వ కార్యాలయంలో ఎండిన తులసి మొక్కలు



షెడ్డు కింద ఎండిన తులసి మొక్కలు

ధారూరు: ఈ మొక్కలు నర్సరీల్లోనే, లేక ప్రకృతి వనాల్లో ఎండిపోయాయని అనుకుంటున్నారా? కాదు.. సాక్షాత్తు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని షెడ్డుకింద ఇలా మోడువారి దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా దాదాపు 200 తులసి మొక్కలు ఎండిపోయి.. కార్యాలయానికి వచ్చేవారిని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. పచ్చదనం పెంచడానికి ప్రభుత్వం చేపట్టిన 'హరితహారం' కార్యక్రమాన్ని ఇలా అధికారులే నిర్లక్ష్యం చేస్తే ఎలా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

త్వరలో నాటిస్తాం

మొక్కల విషయమై ఉపాధిహామీ మండల ఏపీఓ సురేష్‌ను ప్రశ్నించగా.. దోమల నివారణకు మండల పరిషత్ చుట్టూ నాటడానికి తులసి మొక్కలను తెప్పించామని, ఎండుముఖం పట్టిన మొక్కలకు నీరు పడితే తేరుకుంటాయని, త్వరలో వీటిని నాటిస్తామని ఏపీఓ చెప్పారు.

ఘనంగా ఎల్లమ్మ ఉత్సవాలు



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

దోమ: ఉదన్‌రావుపల్లి గ్రామంలో ఎల్లమ్మతల్లి ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ముందుగా అమ్మవారికి బోనాలు, కోడిపుంజులతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని, ఉత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతాయని ఆలయ చైర్మన్ మాలి రాంచంద్రారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో పవన్ కుమార్ రెడ్డి, శివభాస్కర్ రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపట్ల ఆసక్తి చూపండి



క్రికెట్ ఆడుతున్న చైర్‌పర్సన్ స్వప్న

యాలాల: యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ సమీపంలో సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా శుభప్రద్ పటేల్ యువసేన ఆధ్వర్యంలో చేపట్టిన టోర్నీ.. రెండో రోజు పోటీలను తిలకించి మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని కాసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ నర్సింగ్ రావు, నాయకుడు గురురాజ్ జోషి, శుభప్రద్ యువసేన సభ్యులు భానుప్రసాద్, హరీశ్, కుర్వ బాలు, రాముగౌడ్, శ్రీశైలం, విజయ్, నరేష్, పాష తదితరులు ఉన్నారు.

దేశానికి పేరుప్రతిష్టలు తేవాలి



అభ్యర్థులను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

దోమ: అగ్నిపథ్‌కు గ్రామం నుంచి ఎంపికైన అభ్యర్థులు దేశానికి పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. అగ్నిపథ్‌లో ఆర్మీకి ఎంపికైన అభ్యర్థులు చంద్రకంటి పవన్ ముదిరాజ్, నందు యాదవ్‌లను గురువారం బొంపల్లిలో ముదిరాజ్ సంఘం గ్రామ నేతలు, గ్రామస్తులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోనే ముగ్గురు వ్యక్తులు అగ్నిపథ్‌కు ఎంపిక కావడం సంతోషించదగ్గ విషయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత వీరిద్దరిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నేతలు బోయిని జంగయ్య, కృష్ణయ్య, యాదయ్య, బంటు పెంటయ్య, అంజి, రాము, నర్సింహులు, నవీన్, గ్రామస్తులు నరేశ్, మహేశ్, కుర్వ రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రశిబిరంతో ప్రజలకు మేలు



కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

దోమ: కంటివెలుగుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బాస్‌పల్లి గ్రామంలో సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ రాములుతో కలిసి ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంధత్వంతో ఏ ఒక్కరు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చిందని, ప్రజలందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాస్‌పల్లి, బొంపల్లి ఉపసర్పంచులు, అగన్వాడీ టీచర్ సావిత్రి, వైద్యాధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.